సాక్షి నిర్మల్

గురువారం । 6 । ఏప్రిల్ । 2023



పాల కేంద్రం ప్రారంభించండి..

చెన్నూర్‌లో పాల శీతల కేంద్రాన్ని 2013లో మూసివేశారు. పాడి అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని పాల డెయిరీని పునఃప్రారంభించాలని పాడిరైతులు కోరుతున్నారు. 8లో▸



కూలేదాకా చూస్తారా?

సారంగాపూర్‌లో 50 ఏళ్ల క్రితం 50వేల లీటర్ల సామర్థ్యంతో నిర్మించిన వాటర్‌ట్యాంక్ శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు పడిపోతుందో తెలియక ప్రజలు భయాందోళన చెందుతున్నారు. 9లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 37.0 /24.2

ఆకాశం కొంత మేర మేఘావృతమౌతుంది. పగటి పూట చాలావరకు ఎండగా ఉంటుంది. గాలిలో తేమ కారణంగా ఉక్కపోతగా ఉంటుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ గురు : 6:30 | సహర్ శుక్ర: 4:42

న్యూస్‌రీల్

'ఆస్పత్రుల్లో సమస్యలు పరిష్కరించండి'



మంత్రికి విన్నవిస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

భైంసాటౌన్(ముధోల్): భైంసా, ముధోల్ ఆస్పత్రుల్లో అదనపు సౌకర్యాలు కల్పించాలని ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి బుధవారం వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావును కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లో మంత్రిని కలిసి విన్నవించారు. ఆస్పత్రుల్లో వసతులు కల్పించాలని కోరారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

కుంటాల: బీఆర్‌ఎస్ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రి హరీశ్‌రావు సూచించారు. కుంటాల మండలంలోని కల్లూరు గ్రామానికి చెందిన ఈసారం మల్లేశ్‌గౌడ్ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను తనదైన శైలిలో సోషల్ మీడియా, వీడియోల ద్వారా ప్రజల వద్దకు తీసుకెళ్తున్నాడు. బుధవారం హైదరాబాద్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మల్లేశ్‌గౌడ్‌ను అభినందించారు.

'ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి'



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న కమిటీ సభ్యులు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని ఆదర్శనగర్‌లో ఉన్న శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ బుధవారం ఆలయ కమిటీ సభ్యులు మంత్రి ఐకేరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి రూ.20 లక్షల నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు దాసరి దశరథ్, కార్యదర్శి ముల్లేవార్ రమేశ్, కోశాధికారి శ్రీరామోజు విఠల్, రమణ, రాంకిషన్, గట్టు గంగారాం, నర్సింహాచారి, భీమాచారి, రవి, రమణ, గణేశ్, శంకర్, నర్సయ్య, లక్ష్మీనారాయణ, మహేందర్, మహేశ్, రవి, హనుమాన్ గురుస్వామి రాజు, దత్తు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే అరెస్టులు'



రమాదేవిని హౌజ్ అరెస్టు చేసిన పోలీసులు

భైంసాటౌన్/లోకేశ్వరం: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ ఘటనను ప్రజలు మరువకముందే పదో తరగతి పేపర్లు సైతం లీకేజీ కావడంపై ప్రభుత్వ అసమర్థత నుంచి ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే బీజేపీ నాయకులను అక్రమంగా అరెస్టు చేస్తోందని పార్టీ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి, నియోజకవర్గ నాయకులు పవార్ రామారావుపటేల్, మోహన్‌రావుపటేల్ ఆరోపించారు. బుధవారం పోలీసులు రమాదేవితో పాటు పవార్ రామారావుపటేల్‌ను హౌజ్ అరెస్టు చేయగా, మోహన్‌రావుపటేల్‌ను అరెస్టుచేసి లోకేశ్వరం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నాయకుల అక్రమ అరెస్టులను నిరసిస్తూ పట్టణంలోని బీజేపీ నాయకులు సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లీకేజీలకు బాధ్యులను కాకుండా ప్రశ్నించిన వారిని అరెస్టు చేయడమేమిటని ప్రశ్నించారు. బండి సంజయ్ అరెస్టును ఖండిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులు, విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోందన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు.



బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న మంత్రి, నాయకులు



సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నేతలు

లీకేజీ రచ్చ

- బీజేపీ వర్సెస్ బీఆర్‌ఎస్
- పోటాపోటీగా దిష్టిబొమ్మల దహనాలు
- స్వయంగా పాల్గొన్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి
- 'బండి' అసలు రంగు బయటపడిందన్న 'అల్లోల'
- పలుచోట్ల బీజేపీ నేతల అరెస్టులు

నిర్మల్: రాష్ట్రంలో చోటు చేసుకుంటున్న పరిణామాలపై జిల్లాలోనూ ఆందోళనలు కొనసాగుతున్నాయి. బీజేపీ, బీఆర్‌ఎస్‌ల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. పేపర్ లీకేజీలకు మీరంటే మీరే కారణమంటూ ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకుంటున్నారు. పోటాపోటీ ఆందోళనలు, దిష్టిబొమ్మల దహనాలు చేపడుతున్నారు.

దిష్టిబొమ్మల దహనం

పదో తరగతి హిందీ ప్రశ్నపత్రం లీకైన ఘటనలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్‌ను మంగళవారం అర్ధరాత్రి అరెస్టు చేయడం జిల్లాలోనూ సంచలనంగా మారింది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ కావాలనే తమ పార్టీ అధ్యక్షుడిపై కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని బీజేపీ ఆందోళన వ్యక్తం చేస్తోంది. మరోవైపు తమ ప్రభుత్వాన్ని అస్థిరపర్చేందుకే పేపర్ లీకేజీలను చేయించారంటూ బీఆర్‌ఎస్ మండిపడుతోంది. తమ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి అరెస్టుకు నిరసనగా బీజేపీ జిల్లా కేంద్రంతో పాటు పలు మండలాల్లో ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేసింది. మరోవైపు జిల్లా కేంద్రంలోని శివాజీచౌక్‌లో బండి సంజయ్ దిష్టిబొమ్మను బీఆర్‌ఎస్ నాయకులు దహనం చేశారు. ఇందులో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి స్వయంగా పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల అరెస్టు

బండి సంజయ్ అరెస్టు నేపథ్యంలో జిల్లాలో ఎలాంటి ఆందోళనలు జరగకుండా పోలీసు అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఆ పార్టీ ప్రధాన నాయకులను ఎక్కడికక్కడ అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు. భైంసాలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి, రామారావుపటేల్, మోహన్‌రావు పటేల్‌ను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు. తానూరు, లక్ష్మణచాంద తదితర మండలాల్లోనూ పోలీసులు బీజేపీ నాయకులను అరెస్టు చేశారు.

అసలు రంగు బయటపడింది

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి ఐకేరెడ్డి

టీఎస్‌పీఎస్సీ, పదో తరగతి పేపర్‌లీకేజీల విషయంలో పోలీసులు లోతుగా విచారణ చేసిన తర్వాత అసలు రంగు బయట పడిందని, కేంద్రమే తెలంగాణ ప్రభుత్వాన్ని బద్నాం చేయడానికి ఇవన్నీ చేయిస్తోందని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని దివ్యగార్డెన్స్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడారు. పేపర్‌ను లీక్ చేయడమే కాకుండా ప్రశాంత్ అనే బీజేపీ కార్యకర్త నేరుగా వాట్సప్‌లో బండి సంజయ్‌కు ప్రశ్నపత్రం పంపించాడన్నారు. బలమైన సాక్ష్యాధారాలు ఉన్నందునే పోలీసులు సంజయ్‌ను అరెస్టు చేశారన్నారు. ఇన్నిరోజులు ప్రభుత్వంపై ఆరోపణలు చేసిన బండి సంజయ్ ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని మాట్లాడుతారని ప్రశ్నించారు. చేసిన తప్పులకు బీజేపీ క్షమాపణ కోరాలన్నారు. గతంలో ఎప్పుడు కూడా ఇలాంటివి కాలేదని, బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని అస్థిర పర్చడానికే ఇలాంటివి చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణపై కేంద్రం కక్షగట్టిందని, ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రాష్ట్రంలో అలజడి సృష్టించాలని చూస్తోందన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, ఎఫ్‌ఎస్‌సీఎస్ చైర్మన్ ధర్మాజీ రాజేందర్, ఏఎంసీ చైర్మన్ చిలుక రమణ, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

అప్రజాస్వామిక చర్య...



మాట్లాడుతున్న రాజేశ్వర్‌రెడ్డి

తమ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను అర్ధరాత్రి అక్రమంగా అరెస్టు చేయడం అప్రజాస్వామికమని, కేసీఆర్ సర్కారు పిరికిపంద చర్య అని బీజేపీ నాయకులు ఆరోపించారు. స్థానిక అంబేద్కర్‌చౌక్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసిన తర్వాత పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సామ రాజేశ్వర్‌రెడ్డి, తదితరులు మాట్లాడారు. పేపర్ లీకులతో, లిక్కర్ దందాలతో అవినీతిలో కూరుకుపోయిన కేసీఆర్ పాలనను ప్రశ్నించినందుకే సంజయ్‌ను అక్రమంగా అరెస్టు చేశారన్నారు. రాష్ట్రంలో రాక్షసపాలనకు రోజులు దగ్గర పడ్డాయన్నారు. వెంటనే బండి సంజయ్‌ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు అలివేలు మంగ, జిల్లా కార్యదర్శి కొరిపెల్లి శ్రావణ్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ నాయిడి మురళీధర్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు అర్జున్, బీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి అమరవేణి నర్సాగౌడ్, స్టడీసర్కిల్ స్టేట్ కన్వీనర్ వెంకటేశ్, కొండాజి శ్రవణ్, పట్టణ ప్రధాన కార్యదర్శి నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'కి ఎండదెబ్బ!

జిల్లా వివరాలు

మండలాలు	18
గ్రామ పంచాయతీలు	396
గ్రామాలు	428
జాబ్ కార్డులు	1.71 లక్షలు
కూలీల సంఖ్య	3.30 లక్షలు



ఎండలో తలకు గుడ్డ కట్టుకుని పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీలు

- ఐదేళ్లుగా నిలిచిన షామియానాలు, హెల్త్‌కిట్ల సరఫరా
- ఎండలో విలవిలలాడుతున్న కూలీలు
- పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో బెంబేలు
- పనిస్థలాల్లో కానరాని ప్రత్యేక వసతులు

నిర్మల్‌చైన్‌గేట్: పల్లెల నుంచి పట్టణాలకు వలసలు నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు చేస్తోంది. పథకంలో అక్రమాలను నివారించేందుకు కేంద్రం నూతన సాఫ్ట్‌వేర్‌ను రూపొందించింది. అంతేకాకుండా ఇటీవల ఉపాధి కూలి కూడా పెంచింది. ఇంతవరకు బాగానే ఉన్నా కూలీలకు రక్షణ విషయాన్ని మాత్రం ప్రభుత్వం విస్మరించింది. పనిస్థలాల్లో రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పనిచేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఉపాధి హామీ చట్టం ప్రకారం పని ప్రదేశంలో నీడ, తాగునీరు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు ఉంచాలి. కానీ నీడ, నీటి వసతి కానరావడం లేదు. ప్రథమ చికిత్స కిట్ల సరఫరా ఐదేళ్ల క్రితమే నిలిచిపోయింది. దీంతో కూలీలు మండుటెండలో పనులు చేయడానికి ఇబ్బంది పడుతున్నారు.

జాడలేని షామియానాలు

వేసవిలో పని ప్రదేశాల్లో కూలీలకు నీడ కల్పించేందుకు ప్రభుత్వం ఐదేళ్ల క్రితం షామియానాలు సరఫరా చేసింది. ఆ తర్వాత సరఫరా నిలిపివేసింది. పాత షామియానాలు చినిగిపోవడం, కొత్తవి రాకపోవడంతో పని ప్రదేశంలో అధికారులు నీడ కల్పించడం లేదు. దీంతో కూలీలు ఎర్రటి ఎండలోనే పనిచేయాల్సిన పరిస్థితి దాపురించింది.

పత్తాలేని ఫస్ట్ ఎయిడ్ కిట్లు

పనిస్థలాల్లో కూలీలు గాయపడితే ప్రాథమిక చికిత్స అందించేలా కేంద్రం ఐదేళ్ల క్రితం ఉపాధి హామీ మేట్లకు ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందించింది. కానీ అవి మేట్ల వద్దనే ఉండిపోయాయి. ప్రస్తుతం ఎక్కడా మెడికల్ కిట్లు కనిపించడం లేదు. కొత్తవి సరఫరా కావడం లేదు. ప్రమాదం జరిగితే ప్రభుత్వ లేదా ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లాల్సి వస్తోంది. ఆస్పత్రికి వెళ్లడం ఆలస్యమైతే ప్రాణాలు కూడా పోయే ప్రమాదం ఉందని కూలీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇబ్బంది లేకుండా చూస్తున్నాం



ఉపాధి హామీ పనులకు వస్తున్న కూలీలకు ఇబ్బంది కలగకుండా చూస్తున్నాం. ప్రభుత్వం నుంచి టెంట్లు, ఫస్ట్‌ఎయిడ్ కిట్లు రావడం లేదు. స్థానిక ఏఎన్‌ఎంల వద్ద నుంచి ఫస్ట్ ఎయిడ్ కిట్లను తీసుకుని పనిప్రదేశంలో అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నాం.

– విజయలక్ష్మి, డీఆర్డీవో

ఇంటి నుంచే తాగునీరు

పని ప్రదేశంలో కూలీకు గతంలో తాగునీటి వసతి కల్పించేవారు. తర్వాత నిబంధన ఎత్తేశారు. దీంతో కూలీలే ఇళ్ల నుంచి తాగునీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి. వడదెబ్బ తగిలినప్పుడు ప్రాథమికంగా అందించే ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు కూడా కనిపించడం లేదు.

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

ప్రస్తుతం జిల్లాలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. వారం రోజులుగా పగటి ఉష్ణోగ్రత 37 డిగ్రీలకు పైగా నమోదవుతోంది. ఉదయం 8 గంటలకే భానుడు భగభగమంటున్నాడు. దీంతో పనిస్థలాల్లో నీడలేక కూలీలు ఇబ్బంది పడుతున్నారు. ఎండ వేడి అధికంగా ఉండడంతో త్వరగా నీరసించి పోతున్నారు. ఉదయం, సాయంత్రం హాజరు నిబంధన అమలు చేయడంతో పని పూర్తిచేసినా హాజరు కోసం పనిస్థలంలోనే ఉండాల్సి వస్తోంది.



కనుల పండువగా రథోత్సవం

జిల్లా కేంద్రంలోని దేవరకోట శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ 66వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి రథోత్సవం కనుల పండువగా జరిగింది. సార్గమ్మ, నగరేశ్వరవాడ, న్యూ బస్టాండ్, బుధవార్ పేట్, సోమవార్ పేట్ మీదుగా రథయాత్ర కొనసాగింది. ఈ కార్యక్రమానికి మహిళలు మంగళ హారతులతో అధికసంఖ్యలో తరలివచ్చారు. శ్రీనివాసా.. గోవిందా.. వేంకటరమణ గోవిందా .. అంటూ స్మరించారు. శోభాయాత్ర గుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి రవికిషన్, ఆలయ కమిటీ చైర్మన్ లింగంపల్లి లక్ష్మీనారాయణ, ధర్మకర్త దీకొండ పద్మనాభం, తదితరులు పాల్గొన్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

జగ్జీవన్‌రామ్ జీవితం అందరికీ ఆదర్శం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి ఐకేరెడ్డి

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: అంటరానితనం, కులవివక్షను పారదోలేందుకు పోరాడిన బాబూ జగ్జీవన్‌రామ్ జీవితం అందరికీ ఆదర్శమని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో బుధవారం జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలకు మంత్రి, కలెక్టర్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ జీవితంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని సమాజంలోని అణగారిన వర్గాల కోసం పోరాడారన్నారు. భారతదేశపు మొదటి మంత్రి వర్గంలో కార్మిక మంత్రిగా సేవలందించారని గుర్తుచేశారు. సమాజ అభివృద్ధి కోసం ఎన్నో కొత్త చట్టాలు, సంస్కరణలు తీసుకురావడంలో ఆయన పాత్ర మరువలేనిదన్నారు. 33 ఏళ్లకు పైగా కేంద్ర కేబినెట్ మంత్రిగా, ఉప ప్రధానమంత్రిగానూ ఆయన తీసుకున్న అసంఖ్యాక నిర్ణయాలు దేశాభివృద్ధికి ఎంతగానో తోడ్పడ్డాయన్నారు. జిల్లా కేంద్రంలో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, కమిషనర్ రాజు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనాలు విజయవంతం చేయాలి

నిర్మల్‌చైన్‌గేట్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పార్టీ శ్రేణులకు వివరించడం, విపక్షాల విమర్శల వెనుక దురుద్దేశాన్ని ఎండగట్టడం అనే ద్విముఖ వ్యూహంతో సాగుతున్న ఆత్మీయ సమ్మేళనాలు విజయవంతం చేయాలని మంత్రి ఐకేరెడ్డి అన్నారు. నిర్మల్ పట్టణానికి చెందిన 42 వార్డుల బీఆర్‌ఎస్ నేతలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ నెల 7 నుంచి పట్టణంలో జరగనున్న ఆత్మీయ సమ్మేళనాలపై దిశా నిర్దేశం చేశారు. పట్టణంలోని ప్రతీవార్డు నుంచి కౌన్సిలర్, కౌన్సిలర్‌గా పోటీచేసిన అభ్యర్థి, వార్డు ప్రెసిడెంట్, సెక్రటరీ, ముఖ్య కార్యకర్తలు ఆత్మీయ సమ్మేళనానికి హాజరయ్యేలా చూడాలన్నారు.

మళ్లీ మాస్క్ మస్ట్!



జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జ్వర పీడితులు

- కలవర పెడుతున్న కరోనా
- మార్చిలో 4 కేసులు నమోదు
- జ్వరం, జలుబు, దగ్గు బారిన పడుతున్న జనం
- ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో పెరిగిన ఓపీ
- జాగ్రత్తలు తప్పనిసరి అంటున్న వైద్యులు

నిర్మల్‌చైన్‌గేట్: రెండేళ్ల జన జీవనాన్ని అతలాకుతలం చేసిన కరోనా మహమ్మారి పీడ విరగడైందనుకుంటున్న తరుణంలో మరోసారి ముప్పు పొంచి ఉందన్న ప్రకటనలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. జిల్లాలో గడిచిన నెల రోజులుగా జిల్లా ఆస్పత్రిలో నిర్వహించిన 39 పరీక్షల్లో 4 పాజిటివ్ కేసులు వెలుగుచూశాయి. మరోవైపు ప్రజలు జ్వరం, జలుబు, దగ్గు బారిన పడుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఓపీ పెరిగింది. ఈ నేపథ్యంలో తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారులు హెచ్చరిస్తున్నారు. భౌతిక దూరం, మాస్కులు ధరించడంతో పాటు శానిటైజర్లతో చేతులు శుభ్రం చేసుకోవాలని సూచిస్తున్నారు.

ఆర్టీపీసీఆర్, ర్యాపిడ్ టెస్టులు...

జిల్లా ఆస్పత్రిలో ఆర్టీపీసీఆర్, జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు భైంసా ఏరియా ఆస్పత్రిలో కోవిడ్ టెస్టులు నిర్వహిస్తున్నారు. మార్చిమాసంలో జిల్లా ఆస్పత్రిలో నిర్వహించిన ఆర్టీపీసీఆర్ పరీక్షల్లో 4 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. ఫ్లూ జ్వరంతో బాధపడే వారిలో, రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారిలో కరోనా లక్షణాలు బయటపడుతున్నట్లు వైద్యులు పేర్కొంటున్నారు.

వైరస్ లక్షణాలు

వైరస్ కారణంగా జ్వరం రావడం, గొంతు బొంగురుపోవడం, గొంతునొప్పి, ముక్కు దిబ్బడ, జలుబు, తలనొప్పి వంటి లక్షణాలు కనిపిస్తున్నాయి. చిన్న పిల్లలకు వాంతులు, విరేచనాలు అవుతాయి. సైనస్, కళ్లు, చెవి ఇన్‌ఫెక్షన్లు, కఫం, పొడి దగ్గు కూడా ఉంటాయి. ఇన్‌ఫ్లూయెంజా ఏహెచ్3ఎన్2 వైరస్ కారణంగా దగ్గు ఎక్కువ కాలం ఉంటుంది. ఈ ఫ్లూ జ్వరంతో వచ్చే అలసట నెలరోజుల వరకు ఉంటుంది. జ్వరం 5 నుంచి 7 రోజుల్లో తగ్గుతున్నా దగ్గు మాత్రం మూడు వారాల వరకు ఉంటుందని వైద్యులు తెలిపారు.

ఉదయం పరీక్ష.. సాయంత్రం రిపోర్ట్

గతంలో కరోనా పరీక్షలు చేస్తే ఆ రిపోర్టు రోగి చేతికందే సరికి మూడు రోజులయ్యేది. ఈ సమయంలో కరోనా వచ్చిందా.. అనే బెంగతో మరింత బలహీనంగా మారి అత్యవసర పరిస్థితికి చేరి ఆస్పత్రిలో జాయిన్ అయిన వారూ ఉన్నారు. ఇటీవల ఆర్టీపీసీఆర్ కేంద్రం జిల్లా ఆస్పత్రిలో అందుబాటులోకి రావడంతో ఇప్పుడు పరీక్ష చేసిన రోజే రిపోర్ట్ వస్తుంది. ఉదయం పరీక్ష చేస్తే సాయంత్రం రిపోర్ట్ చేతికందుతుంది. ప్రస్తుతం కరోనా వ్యాప్తిలో ల్యాబ్ సేవలు కీలకంకానున్నాయి.

అందుబాటులో ఆక్సిజన్ ప్లాంట్...

ఫస్ట్, సెకండ్ వేవ్ సమయంలో జిల్లా ఆస్పత్రిలో కోవిడ్ బాధితులకు చికిత్స అందిస్తున్న సమయంలో కొన్నిసార్లు ఆక్సిజన్ కొరత ఇబ్బందిగా మారింది. 2022 జనవరిలో ఆక్సిజన్ ఉత్పాదక ప్లాంటును అందుబాటులోకి తెచ్చారు. ఇది నిమిషానికి 2 వేల లీటర్ల ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఏకకాలంలో వందల మందికి ప్రాణ వాయువు అందించే అవకాశం లభించింది.

వ్యాక్సినేషన్‌కు స్వస్తి..

జిల్లాలోని నిర్మల్, భైంసా, ఖానాపూర్ నియోజకవర్గాల పరిధిలో కోవిడ్ బూస్టర్ డోస్ తీసుకున్నవారి సంఖ్య చాలా తక్కువగా ఉంది. మూడు నియోజకవర్గాల్లో ఇప్పటివరకు సుమారు 14,94,710 మంది కోవిడ్ వ్యాక్సిన్ తీసుకున్నారు. వీరిలో 6,30,230 మంది ఫస్ట్‌డోస్, 6,28,646 లక్షల మంది సెకండ్ డోస్ తీసుకోగా కేవలం 2,35,834 మంది మాత్రమే బూస్టర్ డోస్ తీసుకున్నారు.

కరోనా పరీక్షకు వెనుకాడొద్దు



జ్వరం లక్షణాలతో ఆస్పత్రులకు వస్తున్న ప్రజలు వైద్యుల సలహా మేరకు చికిత్స పొందాలి. దేశంలో కరోనా కేసులు నమోదవుతున్నాయి. జిల్లా ఆస్పత్రితో పాటు ప్రతీ పీహెచ్‌సీ పరిధిలో ఆర్టీపీసీఆర్ పరీక్షలు నిర్వహిస్తున్నాం. లక్షణాలు ఉన్నవారు పరీక్ష చేసుకోవడానికి వెనుకాడొద్దు. అనుమానితులూ పరీక్షలు చేసుకోవాలి. భౌతిక దూరం పాటించడంతో పాటు మాస్క్ ధరించాలి. శానిటైజర్లతో చేతులు శుభ్రం చేసుకోవాలి. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి.

– ధన్‌రాజ్, డీఎంహెచ్‌వో

ఈ జాగ్రత్తలు పాటించాలి..

- దగ్గు, తుమ్ములు, వైరస్ సోకిన వ్యక్తితో సన్నిహితంగా ఉండటం ద్వారా మిగతా వారికి వ్యాపిస్తాయి.
- చేతులు శుభ్రం చేసుకోవడం, బహిరంగ ప్రదేశాల్లో మాస్కులు ధరించడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలి.
- 65 ఏళ్ల పైబడిన వృద్ధులు, అనారోగ్య సమస్యలు ఉన్నవారు రద్దీ ప్రదేశాలకు దూరంగా ఉండాలి.
- తుమ్మినప్పుడు, దగ్గేటప్పుడు నోరు, ముక్కును కప్పి ఉంచాలి. కళ్లు, ముక్కును చేతులతో తాకరాదు.
- ఆక్సిజన్ లెవల్స్ తగ్గకుండా చూసుకోవాలి.
- ఆక్సిజన్ స్థాయి 95 శాతం కంటే తక్కువ ఉంటే వైద్యులను సంప్రదించాలి.
- 90 శాతానికి దిగువన పడిపోతే ఐసీయూలో చికిత్స అవసరం.

క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందిస్తున్న నాయకులు

ఖానాపూర్: మండలంలోని బీర్నంది పంచాయతీ పరిధిలోని రంగపేటకు చెందిన పాలాస రవి బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్నాడు. ఈ విషయమై గత నెల 20న 'దాతలు సాయమందించరూ' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి స్పందించిన పలువురు బుధవారం బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందించారు. మంచిర్యాల జిల్లా జన్నారం జెడ్పీహెచ్ఎస్ 1989–90 బ్యాచ్‌కు చెందిన పదోతరగతి మిత్రులు కుటుంబానికి రూ.10000, ఖానాపూర్ విశ్వబ్రాహ్మణ మండల కమిటీ ఆధ్వర్యంలో రూ.8,600, ఖానాపూర్‌కు చెందిన కొక్కుల లక్ష్మి ఆధ్వర్యంలో రూ.2500 సాయం అందజేశారు. ఇప్పటి వరకు రూ.1,50,000 అందినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బల్యాల రమేష్, తుమ్మనపల్లి వెంకటరమణ, పడకంటి భీమన్న, బి.నాగభూషణం, లక్ష్మణ్‌రావు, వాల్‌సింగ్, నవీన్‌యాదవ్ ఉన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్ ఇస్తున్న కానిస్టేబుల్

సారంగపూర్: నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన ఇలియాజుద్దీన్ అనే వ్యక్తి బుధవారం గండి రామన్న హరిత వనం వద్ద ద్విచక్రవాహనంపై వెళ్తున్న క్రమంలో తన సెల్‌ఫోన్ పడిపోయింది. ఆయన వెంటనే పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. వెంటనే ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి నిర్మల్‌కు చెందిన ఐటీ కోర్ ఆర్ఎస్ఐ రవినాయుడు సహకారంతో మొబైల్ లొకేషన్ ఆధారంగా ఫోన్ ఉన్న ప్రదేశాన్ని కనుగొని ఆ ఫోన్ రికవరీ చేసి బాధితుడికి అప్పగించాడు. తన ఫోన్‌ను త్వరగా కనిపెట్టి ఇచ్చిన పోలీసులకు బాధితుడు కృతజ్ఞతలు తెలిపాడు.

బావిలో పడి వ్యక్తి మృతి

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఊరు మందమర్రి గ్రామానికి చెందిన కంది తిరుపతి(47) ఇంటి సమీపంలోని బావిలో పడి మృతి చెందాడు. ఎస్సై చంద్రకుమార్ వివరాల ప్రకారం.. మద్యానికి బానిసైన తిరుపతి బుధవారం ఉదయం బావి వద్దకు స్నానం చేయడానికి వెళ్లాడు. బావిలో నీళ్లు తోడే క్రమంలో ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందాడు. తండ్రి పుల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

'అడెల్లి'లో వేలం వాయిదా

సారంగపూర్: మండలంలోని అడెల్లి మహాపోచమ్మ ఆలయంలో భక్తులు అమ్మవారికి సమర్పించే ఒడిబియ్యం సేకరణ హక్కును బుధవారం బహిరంగ వేలం నిర్వహించాల్సి ఉండగా అనివార్య కారణాల వల్ల నిలిపివేసినట్లు ఆలయ సీనియర్ అసిస్టెంట్ రమణారావు తెలిపారు.



మూసివేసిన చెన్నూర్ పాలశీతల కేంద్రం(ఫైల్)

పాల కేంద్రం ప్రారంభించండి

చెన్నూర్ వ్యవసాయ ఆధారిత ప్రాంతం. ఇక్కడ పాడి రైతులు ఎక్కువే. వ్యవసాయంపై ఆదాయం నామమాత్రమే కావడంతో పాలతో కొంత ఉపాధి పొందుతున్న పాడి రైతుకు ఇక్కడి పాలకేంద్రం మూసివేయడంతో ఉన్న కాస్తా ఉపాధి కరువైంది. దీంతో పాల విక్రయానికి పడరాని పాట్లు పడాల్సిన దుస్థితి. ఇకనైనా అధికారులు, పాలకులు పట్టించుకుని స్థానికంగా మూసివేసిన పాల శీతల కేంద్రాన్ని తిరిగి ప్రారంభించి ఉపాధి కల్పించాలని పాడిరైతులు కోరుతున్నారు.

- చెన్నూర్‌లో 2013లో పాల డెయిరీ మూసివేత
- ఇంటింటికీ వెళ్లి పాలు అమ్ముకుంటున్న పాడి రైతులు
- చెన్నూర్‌తో పాటు నాలుగు మండలాల్లో 2వేల మంది..
- పాలశీతల కేంద్రాన్ని పునఃప్రారంభించాలని వేడుకోలు

చెన్నూర్: ఒకప్పుడు జిల్లాలోనే చెన్నూర్ పాలశీతల కేంద్రం రైతులతో కళకళలాడేది. పాలశీతల కేంద్రాల్లో పాలు విక్రయించడంతో వందలాది మంది రైతులకు ఉపాధి లభించేది. అధికారుల నిర్లక్ష్యం, అప్పటి ప్రభుత్వ పట్టింపులేని తనంతో రైతుల పాలిట శాపంగా మారింది. లాభాల బాటలో నడుస్తున్న పాలశీతల కేంద్రాన్ని అర్ధంతరంగా మూసివేశారు. కేంద్రం మూతపడి భవనం శిథిలావస్థకు చేరడంతో ఆ స్థలాన్ని కేసీఆర్ పార్క్‌గా ఏర్పాటు చేశారు. దీంతో పాలు కొనుగోలు చేసేవారు లేక ఇంటింటికీ వెళ్లి రైతులే విక్రయించుకుంటున్నారు. ప్రస్తుతం చెన్నూర్, వేమనపల్లి, భీమారం నాలుగు మండలాల్లో 2వేల మంది పాడి రైతులున్నారు. కొందరు పాలను హోటళ్లు, ఇళ్లల్లో విక్రయిస్తుండగా మరికొందరు పాలు విక్రయాలు లేక నష్టాల పాలవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పాడి పరిశ్రమను అభివృద్ధి చేసి పాడి రైతులను ఆదుకునేందుకు ఓ వైపు ఎన్నో పథకాలు ప్రవేశపెడుతున్నప్పటికీ అవి పూర్తిస్థాయిలో దరిచేరడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాడి అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని మూసివేసిన పాల డెయిరీని పునః ప్రారంభించాలని పాడిరైతులు కోరుతున్నారు.

చెన్నూర్‌లో...

చెన్నూర్‌లో 2003లో అప్పటి ప్రభుత్వం పాలశీతల కేంద్రాన్ని ప్రారంభించింది. ఈ కేంద్రంలో మేనేజర్‌తో పాటు మరో 10 మంది సిబ్బంది పనిచేసేవారు. రోజుకు సుమారు 3వేల నుంచి 4వేల లీటర్ల పాలను సుమారుగా 800 మంది వరకు రైతులు విక్రయించేవారు. పాల శీతల కేంద్ర పరిధిలోని మండలాల్లోని గ్రామాలకు వెళ్లి ఆటోల ద్వారా పాలను సేకరించి నిజామాబాద్‌లోని ఏపీ డెయిరీకి తరలించేవారు. 2003 నుంచి 2008 వరకు పాలశీతల కేంద్రం లాభాల బాటలో పయణించింది. రైతులకు సకాలంలో డబ్బులు చెల్లించడంతో పాడి రైతులు అభివృద్ధి దిశగా పయనించారు. తరువాత పాలశీతల కేంద్ర మేనేజర్ డబ్బులు సక్రమంగా చెల్లించకపోవడంతో క్రమంగా రైతులు కేంద్రానికి పాలను విక్రయించడం మానేశారు. కేంద్రానికి పాలు సక్రమంగా రాకపోవడంతో పాటు కేంద్రాల నిర్వహణ భారంగా మారడం, సిబ్బంది వేతనాలు చెల్లించకపోవడం, నష్టాల సాకు చూపుతూ అధికారులు చెన్నూర్ డెయిరీని 2013లో మూసివేశారు. దీంతో చెన్నూర్, కోటపల్లి, భీమారం గ్రామాలకు చెందిన రైతులు కొందరు నెయ్యి తయారు చేసి పట్టణ ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి డెయిరీ ఏర్పాటు చేయాలని రైతులు వేడుకుంటున్నారు.

భవనాన్ని కేటాయిస్తే.. బీఎంసీ ఏర్పాటు చేస్తాం

చెన్నూర్‌లో పాల డెయిరీ మూసివేసిన విషయం తెలిసింది. అక్కడి మిషన్లు చెడిపోతుండడంతో లక్సెట్టిపేటకు తరలించాం. ప్రస్తుతానికి భవనం లేదు. అధికారులు భవనం ఇచ్చి విద్యుత్‌తో పాటు నీటి సౌకర్యం కల్పిస్తే ప్రస్తుతం వెయ్యి లీటర్ల పాల కొనుగోలు బీఎంసీ (బ్లక్ మిల్క్ సెంటర్) పక్షం రోజుల్లో ఏర్పాటు చేస్తాం. పాల ఉత్పత్తి పెరిగితే 3వేల లీటర్ల సామర్థ్యం గల మిషన్లు ఏర్పాటు చేస్తాం.

– మధుసూదన్‌రావు, పాల డెయిరీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా డీడీ

పాలశీతల కేంద్రం ఏర్పాటు చేయాలి



చెన్నూర్‌లో పాలశీతల కేంద్రం ఏర్పాటు చేయాలి. పాల డెయిరీ లేక తిప్పలు పడుతున్నాం. అధికారులు స్పందించి కేంద్రం ఏర్పాటు చేస్తే స్థానిక రైతులకు ఎంతో మేలు జరుగనుంది.

–శకుంతల కొత్తపల్లి రాజారాం, కోటపల్లి

పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య

ఆదిలాబాద్‌రూరల్: పురుగుల మందుతాగి రైతు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుధవారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై నాగనాథ్ వివరాల ప్రకారం... మండలంలోని లోకారి గ్రామానికి చెందిన సంతోషం శ్రీనివాస్(35)కు ఐదెకరాల పోడు వ్యవసాయ భూమి ఉంది. వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. మద్యం మత్తులో మంగళవారం ఉదయం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య నవనీత, ఐదేళ్ల కుమార్తె, మూడేళ్ల కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని మరొకరు..

సారంగపూర్: ఉరేసుకుని ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం... మలక్‌చించోలి గ్రామానికి చెందిన ఐటీ మల్లేష్(40) కొన్నేళ్లుగా మద్యానికి బానిసై పనిచేయకుండా తిరుగుతున్నాడు. ఈ క్రమంలో భార్య రజిత పలుమార్లు వారించినా వినిపించుకోకుండా ప్రతి రోజు అతిగా మద్యం సేవించేవాడు. ఇదే క్రమంలో గత సోమవారం బంధువుల ఇంట్లో శుభకార్యం నిమిత్తం కుటుంబ సభ్యులంతా కలిసి ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్‌కు వెళ్లారు. అక్కడ శుభకార్యం ముగియగానే మంగళవారం సాయంత్రం మల్లేశ్ ఒంటరిగా స్వగ్రామానికి వచ్చాడు. అప్పటి నుంచి భార్య ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఎత్తకపోయేసరికి బుధవారం పక్కింటి వారికి ఫోన్ చేసి విషయం తెలిపింది. వారు ఇంటికి వెళ్లి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించాడు. వెంటనే కుటుంబీకులు ఇంటికి చేరుకుని రోదించారు. మద్యం మత్తులో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణాసాగర్‌రెడ్డి తెలిపారు. మృతుడికి భార్య, ఏడేళ్లలోపు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

తప్పిన పెను ప్రమాదం

- క్యాబిన్‌లో ఆకస్మాతుగా మంటలు
- లారీ నుంచి దూకిన డ్రైవర్, క్లీనర్



లారీలో చెలరేగుతున్న మంటలు

లక్ష్మణచాంద: ఆకస్మాత్తుగా లారీ క్యాబిన్‌లో మంటలు చెలరేగిన ఘటనలో డ్రైవర్ అప్రమత్తతో తృటిలో పెను ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే.. బుధవారం నెల్లూరు జిల్లా నుంచి నిమ్మకాయల లోడ్‌తో ఢిల్లీకి వెళ్తున్న లారీ నిర్మల్ జిల్లా సోన్ మండలంలోని కడ్తాల్ గ్రామంలోని జాతీయ రహదారి వద్దకు రాగానే లారీ క్యాబిన్‌లో మంటలు చెలరేగాయి. దీంతో వెంటనే అప్రమత్తమైన డ్రైవర్ నర్సింహులు లారీని ఆపాడు. వెంటనే డ్రైవర్, ఇద్దరు క్లీనర్లు లారీ నుంచి కిందకు దూకారు. దీంతో స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వెంటనే గమనించిన స్థానికులు ఫైర్ ఇంజన్‌కు సమాచారం ఇచ్చారు. సోన్ ఎస్సై రవీందర్ సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అడవిపంది దాడిలో ఒకరికి గాయాలు



గాయపడిన మడవి జలపతి

ఉట్నూర్‌రూరల్: మండలంలోని కన్నాపూర్ గ్రామానికి చెందిన మడావి జలపతి అడవి పందుల దాడిలో గాయాలపాలయ్యాడు. వ్యవసాయ పనుల నిమిత్తం కన్నాపూర్ గ్రామ సమీపాన పనులు చేస్తుండగా అడవి పంది దాడి చేయగా కాలికి, చేతికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు. విషయం తెలుసుకున్న ఉట్నూర్ ఎంపీపీ జైవంత్‌రావు గాయాలపాలైన జలపతిని పరామర్శించారు.

పాము కాటుకు చిన్నారి మృతి



హర్షిత (ఫైల్)

రెబ్బెన(ఆసిఫాబాద్): బుజ్జిబుజ్జి మాటలతో కుటుంబంలో సందడి నింపే ఈ చిన్నారి మాటలు మూగబోయాయి. కుటుంబ సభ్యులతో కలిసి ఆడిపాడి నిద్రకు ఉపక్రమించిన సమయంలో పాముకాటు రూపంలో మృత్యువు కబలించింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని ఇందిరానగర్‌కు చెందిన వడ్లూరి రాజు, సౌజన్య దంపతులకు ముగ్గురు సంతానం. వీరిలో రెండో సంతానమైన హర్షిత (9) 3వ తరగతి చదువుతోంది. తల్లిదండ్రులు కూలీ పనులు చేసుకుంటూ ముగ్గురు పిల్లలను అల్లారుముద్దుగా పెంచుకుంటున్నారు. హర్షిత రోజు మాదిరగానే మంగళవారం రాత్రి భోజనం చేసి కుటుంబ సభ్యులతో కలిసి నేల మీదే పడుకుంది. రాత్రి కుడి చేతిపై ఏదో కాటు వేయడంతో మంటగా ఉందని తల్లిదండ్రులను నిద్రలేపింది. అప్పటికే చేయి వాపు రాగ నోట మాట మారిపోయింది. హుటాహుటిన కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌లో ఆసిఫాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే హర్షిత మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

జీఆర్ఎస్ క్యాంపు వద్ద ఉద్రిక్తత



జీఆర్ఎస్ క్యాంపు వద్ద ఆందోళనకారులు

- ఫర్నిచర్ ధ్వంసం, సిబ్బందిపై దాడి

రెబ్బెన(ఆసిఫాబాద్): స్థానికులకే ఓబీ కంపెనీలో ఉద్యోగాలు కల్పించాలని బెల్లంపల్లి ఏరియాలోని భూనిర్వాసిత ప్రాంతాల నుంచి యువకులు, మహిళలు మంగళవారం పెద్ద ఎత్తున ఖైరిగూడ ఓసీపీలో ఓబీ పనులు చేపడుతున్న కాంట్రాక్టు సంస్థ జీఆర్ఎస్ క్యాంపునకు చేరుకోవడంతో ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది. ఓబీ కంపెనీలో స్థానికులకే ఉపాధి అవకాశం కల్పించాలని గత కొన్ని రోజులుగా చేపడుతున్న ఆందోళన తారా స్థాయికి చేరుకుంది. సింగరేణి ఓసీపీల ఏర్పాటు కోసం భూములు తీసుకుని ఓబీ కంపెనీలో ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి తీరా ఓసీపీలో పనులు ప్రారంభమయ్యాక వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున కార్మికులను తీసుకొచ్చి పనులు కల్పిస్తున్నారని ఆగ్రహించారు. వివిధ రాష్ట్రాల నుంచి తీసుకొచ్చిన కార్మికులను వెంటనే పంపించాలని డిమాండ్ చేస్తూ జీఆర్ఎస్ క్యాంపులోకి దూసుకెళ్లడంతో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. జీఆర్ఎస్‌లో పనిచేస్తున్న పలువురు సిబ్బందిపై దాడి చేయడంతో పాటు క్యాంపులోని ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న తిర్యాణి, రెబ్బెన పోలీసులు భారీ బందోబస్తుతో సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడి క్యాంపు నుంచి బయటకు పంపించారు.

20 మందిపై కేసు నమోదు...

తిర్యాణి: జీఆర్ఎస్ క్యాంపుల్లోకి వెళ్లి ఫర్నీచర్ ధ్వంసం చేయడంతో పాటు సిబ్బందిపై భూనిర్వాసితులు దాడికి పాల్పడ్డారు. ఫిర్యాదు మేరకు 20మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేశ్ తెలిపారు.

టీఎస్‌పీఎస్సీ కేసు సీబీఐకి అప్పగించాలి

నిర్మల్‌చైన్‌గేట్: టీఎస్‌పీఎస్సీ బోర్డు చైర్మన్‌పై చర్యలు తీసుకుని కేసును సీబీఐకి అప్పగించాలని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి బన్సీలాల్ రాథోడ్, జిల్లా అధ్యక్షుడు అడ్వకేట్ జగన్మోహన్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని స్థానిక విశ్రాంతి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పేపర్ లీకేజీ కేసులో ముఖ్యమంత్రి బంధువులైన వారిని శిక్షించాలన్నారు. నిరుద్యోగులపై ఏ మాత్రం కనికరం లేకుండా పేపర్ లీకేజీ సహజమేనని మాట్లాడిన మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి తక్షణమే తమ పదవులకు రాజీనామా చేయాలన్నారు. వివిధ పోటీ పరీక్షకు సిద్ధమవుతున్న నిరుద్యోగులకు ప్రభుత్వం 50వేల ఆర్థిక సాయం అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మారరాజన్న, నేర రాజన్న, జిల్లా మహిళా కన్వీనర్ ఎస్కే లక్ష్మి, నిర్మల్ అసెంబ్లీ అధ్యక్షుడు బత్తుల రంజిత్, అసెంబ్లీ నాయకులు నిగులపు లింగన్న పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి



ఆడె అరవింద్ (ఫైల్)

నేరడిగొండ: మండలంలోని కుంటాల జలపాతం వెళ్లే రహదారిపై మంగళవారం రాత్రి బైక్‌పై నుంచి పడి గాయాలపాలైన ఆడె అరవింద్ (36) బుధవారం ఉదయం ఆదిలాబాద్ రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతిచెందాడు. శంకరాపూర్ గ్రామానికి చెందిన అరవింద్ కుంటాల(కె) గ్రామానికి బైక్‌పై వెళ్లి తిరుగు ప్రయాణంలో చిన్నబుగ్గారం వద్ద బైక్ అదుపు తప్పి కిందపడగా గాయాలయ్యాయి. 108లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య వనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయన్న తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఫారెస్ట్ వాచర్ మృతి

బజార్‌హత్నూర్: మండలంలోని దేగామ గ్రామ సమీపంలో ఫారెస్ట్ వాచర్ బస్సీ జ్ఞానేశ్వర్(26) రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఎస్సై సయ్యద్ ము జాహిద్ వివరాల ప్రకారం... మండలంలోని బుర్కపల్లి గ్రామానికి చెందిన బస్సీ జ్ఞానేశ్వర్ (26), ఏర్వాల్ సీతారాం ఇద్దరు ఫారెస్ట్ వాచర్లు. ఇరువురు బైక్‌పై మంగళవారం రాత్రి 11గంటల సమయంలో ఇంటి నుంచి జాతర్ల గ్రామానికి పెట్రోలింగ్‌కు వెళ్తున్న సమయంలో దేగామ క్రాస్ రోడ్డు వద్ద బైక్ అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించగా అప్పటికే జ్ఞానేశ్వర్ మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఏర్వాల్ సీతారాం ప్రస్తుతం రిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. మృతుడి భార్య అశ్విని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఏడాదిన్నర కుమారుడు ఉన్నారు.

ఇద్దరికి కోవిడ్

ఎదులాపురం: జిల్లా వ్యాప్తంగా బుధవారం 56 మందికి కోవిడ్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా ఇద్దరికి పాజిటివ్ వచ్చినట్లు జిల్లా వైద్యాధికారి నరేందర్ రాథోడ్ తెలిపారు. జైనథ్ చెందిన 30 ఏళ్ల మహిళ, ఇచ్చోడలోని కేశవపట్నంకు చెందిన వృద్ధుడికి పాజిటివ్ వచ్చినట్లు పేర్కొన్నా రు. దీంతో యాక్టివ్ కేసుల సంఖ్య జిల్లా వ్యాప్తంగా నాలుగుకు చేరుకుంది. ప్రస్తుతం నలుగురు హోమ్ ఐసోలేషన్‌లో చికిత్స పొందుతున్నారు.

ఆటో చోరీ.. పట్టుకున్న డ్రైవర్లు



ఆటోను పట్టుకున్న డ్రైవర్లు

కాగజ్‌నగర్‌టౌన్: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సమీపంలో పార్కింగ్ చేసిన ఆటోను బుధవారం గుర్తు తెలియని వ్యక్తి చోరీ చేసిన సంఘటన వెలుగులోకి వచ్చింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. దహెగాం మండలం కర్జెల్లి నివాసి లచ్చన్న తన ఆటోను ఎస్‌బీఐ వద్ద పార్కింగ్ చేసి సెల్ ఫోన్ కొనుగోలు చేసి వచ్చే సరికి ఆటో చోరీకి గురైంది. బాధితుడు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆ ఆటోను పర్ధాన్‌గూడ గ్రామానికి చెందిన వెంకటేష్ అపహరించి బస్టాండ్ మీదుగా వెళ్తుండగా ఆటో డ్రైవర్లు చాకచక్యంగా పట్టుకొని నిందితుడితో పాటు ఆటోను పోలీసులకు అప్పగించారు.

పూర్తయిన పంటనష్టం సర్వే

- 308 ఎకరాల్లో నష్టం



దండేపల్లి మండలంలో దెబ్బతిన్న మొక్కజొన్న పంట (ఫైల్)

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో గత నెలలో అకాల వర్షాలతో నష్టపోయిన పంటలను అధికారులు పూర్తిస్థాయిలో సర్వే చేపట్టి నివేదికను బుధవారం ప్రభుత్వానికి అందజేశారు. గత నెలలో ప్రాథమిక సర్వే చేపట్టిన అధికారులు మరోసారి క్షేత్రస్థాయిలో వ్యవసాయ, విస్తరణ అధికారి (ఏఈవో)తో పాటు, ఉద్యానవన శాఖ, వీఆర్ఏ కలిసి దెబ్బతిన్న వివిధ పంట పొలాలను సర్వే చేసి అందుకు అనుగుణంగా గ్రామాల వారీగా రైతుల పేర్లు, ఇతర వివరాలు నమోదు చేశారు. ప్రభుత్వం ఎకరాకు రూ.10వేల చొప్పున ఆర్థిక సాయం ప్రకటించడంతో ప్రభుత్వ గైడ్‌లైన్స్ ప్రకారం గ్రామాల వారీగా సర్వే చేపట్టారు. పంట నష్టం సర్వేలో ఎలాంటి పొరపాట్లు తావు లేకుండా నిర్వహించాలని కలెక్టర్ వ్యవసాయ అధికారులకు సూచించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా 33 శాతం కన్న ఎక్కువగా నష్టపోయిన పంటలను గుర్తించారు. దండేపల్లి మండలంలోని 8 గ్రామాలు, హాజీపూర్ మండలంలోని నమ్నూర్, మందమర్రి మండలంలోని సారంగపల్లి, జన్నారం మండలంలోని రాంపూర్, తిమ్మపూర్, సింగరాయిపేట, రోటిగూడ గ్రామాలలో వరి, మొక్కజొన్న, మిర్చి, మామిడి పంటలకు నష్టం వాటిల్లినట్లు గుర్తించారు. మొత్తం 13 గ్రామాలలో 297 మంది రైతులకు చెందిన 308 ఎకరాల్లో జరిగిన నష్టాన్ని నమోదు చేసి ప్రభుత్వానికి అందజేశారు. ఈ నష్టానికి ప్రభుత్వం ప్రకటించిన ఎకరానికి రూ.10వేల చొప్పున మొత్తం రూ. 30లక్షల 80 వేలు రైతులకు అందించాల్సి ఉంది.

33 శాతంపైన దెబ్బతిన్న పంటలకే..

జిల్లాలో మార్చి 16 నుంచి 21 తేదీలలో వడగళ్ల వర్షం పడింది. ఈ వర్షానికి దండేపల్లి, జన్నారం, హాజీపూర్, మందమర్రి మండలాల్లో వరి, మొక్కజొన్న పంటలు నేలబారాయి, మిర్చి, మామిడి పంటలు కాయాలు నేలరాలాయి. మొక్కజొన్న, వరికి ఎక్కువగా నష్టం వాటిల్లింది.



మూగజీవాల స్నేహ బంధం

నిర్మల్ జిల్లా నర్సాపూర్(జి) మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన అప్పల చిన్నయ్యకు ఓ దుడ్డె ఉంది. అయితే బుధవారం సాయంత్రం ప్రధాన రహదారిపైకి ఆ దుడ్డె వెళ్లగా ఓ కుక్క ఆ దుడ్డె మెడలోని తాడును లాగుతూ రోడ్డుపైకి వెళ్లకుండా చూస్తోంది. ఆ దృశ్యం చూసిన పలువురు ఆశ్చర్యపోయారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

క్లుప్తంగా

బాలింతలకు వైద్యపరీక్షలు

లోకేశ్వరం: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం బాలింతలకు హెల్త్ సూపర్‌వైజర్ కమల వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రతినెలా తప్పనిసరిగా తల్లులు వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త సునీత, సుజాత, ఆశాకార్యకర్తలు ఉన్నారు.

పల్లకీసేవ



వేడుకలో పాల్గొన్న వార్‌కరి భక్తులు

తానూరు: ప్రతీ ఒక్కరు భక్తి మార్గంలో నడవాలని నర్సింగ్ మహరాజ్ అన్నారు. బుధవారం మండలంలోని దాగాం గ్రామంలో జ్ఞానేశ్వరి పారాయణం పల్లకిసేవ ఊరేగింపు నిర్వహించారు. హనుమాన్ ఆలయం ప్రాగణంలో ఆరు రోజులుగా కొనసాగుతున్న అఖండ హరినామ సప్తాహం బుధవారం ముగిసింది. దీంతో వార్‌కరి భక్తులు జ్ఞానేశ్వరి పారాయణం పల్లకిసేవ శోభాయాత్ర నిర్వహించగా మహిళలు మంగళ హారతులతో పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

మామడ: మండలంలోని పొన్కల్ గ్రామంలో ఎన్‌ఆర్‌ఐ పరికిపండ్ల ప్రశాంత్ ఏర్పాటు చేయించిన చలివేంద్రాన్ని బుధవారం పీఏసీఎస్ చైర్మన్ హరీశ్‌కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ నరేశ్‌రెడ్డి, మనోహర్, హన్మంత్‌రావ్, సుధాకర్‌రెడ్డి, రాజారెడ్డి, వెంకటనర్సయ్య, గంగన్న, సుదర్శన్ పాల్గొన్నారు.

హనుమాన్ ప్రతిమ అందజేత

ఖానాపూర్: మండలంలోని గోసంపల్లెకి చెందిన అమంద రాజేందర్–శైలజ దంపతులు గ్రామంలోని హనుమాన్ ఆలయానికి రూ.30వేల విలువైన పంచలోహ హనుమాన్ ఉత్సవమూర్తి ప్రతిమను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రతిమను ఊరేగింపుగా తీసుకెళ్లి ఆలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, దీక్షాపరులు ఉన్నారు.

ముధోల్ ఎస్సైగా సాయికిరణ్



ముధోల్: ముధోల్ ఎస్సైగా బుధవారం సాయికిరణ్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన తిరుపతి బదిలీపై భైంసాకు వెళ్లడంతో కుంటాల ఎస్సై సాయికిరణ్ ముధోల్‌కు వచ్చారు.

కుంటాల ఎస్సైగా హన్మాండ్లు



కుంటాల: కుంటాల ఎస్సైగా హన్మాండ్లు బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈ యన భైంసాటౌన్ ఎస్సైగా పనిచేశారు. ఇక్కడ ఎ స్సైగా పని చేసిన సాయికిరణ్ ముధోల్ ఎస్సైగా వె ళ్లారు. శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని నూతన ఎస్సై పేర్కొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

దస్తురాబాద్: మండలంలోని భూత్కూర్ పంచాయతీ పరిధిలోని గోండుగూడలో బుధవారం సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు బీజేపీకో హఠావ్ దేశ్‌కో బచావ్‌లో భాగంగా ఇంటింటికీ సీపీఐ కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు భుక్య రమేశ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీరుతో వివిధ రంగాల్లో జరుగుతున్న అన్యాయాలను ప్రజలకు వివరించేందుకు తెలంగాణలో ఇంటింటికీ సీపీఐ కార్యక్రమం తీసుకెళ్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

ముస్తాబైన ఆలయాలు

భైంసాటౌన్: పట్టణంలో గురువారం హనుమాన్ జయంతి పురస్కరించుకొని హనుమాన్ ఆలయాలు ముస్తాబయ్యాయి. జయంతి సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తుల కోసం ఏర్పాట్లు చేశారు. భక్తులతోపాటు అంజన్న దీక్షాపరులు ఉదయం నుంచే ఆలయాల్లో పూజలు నిర్వహించనున్నారు. అలాగే ఆలయ కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించనున్నారు.

చెక్కులు పంపిణీ

కుంటాల: కుంటాలకు చెందిన కుమ్మరి మహేశ్, పరమేశ్వర్, చాట్ల పెద్ద సాయన్నకు నాయకులు గ్రామంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. గజ్జారాం, గ్రామ కమిటీ అధ్యక్షుడు రమేశ్, దత్తాద్రి, వెంకటేశ్, గజేందర్, మహేశ్వర్, రవి, తదితరులు పాల్గొన్నారు.

బహూకరణ

కుంటాల: మండల కేంద్రంలోని శ్రీ వీర హనుమాన్ ఆలయంలో బుధవారం గ్రామానికే చెందిన ఒడ్నం మమత–కృష్ణ దంపతులు ఏడు తులాల వెండి ముఖ కవచం బహూకరించారు. అనంతరం దాతను సన్మానించారు. ఎంపీపీ గజ్జారాం యాదవ్, గురుస్వామి భుజంగం గణపతి, గజానంద్ పాల్గొన్నారు.

కూలేదాకా చూస్తారేమో..?

- సారంగపూర్‌లో శిథిలావస్థకు చేరిన పాత నీటిట్యాంక్
- స్థానికులకు పొంచి ఉన్న ముప్పు



50 ఏళ్ల కిందట నిర్మించిన పాత ట్యాంక్



ఇనుప చువ్వలు తేలి ప్రమాదకరంగా ట్యాంక్

సారంగపూర్: మండల కేంద్రంలో 50 ఏళ్ల కిందట 50వేల లీటర్ల సామర్థ్యంతో నిర్మించిన వాటర్‌ట్యాంక్ శిథిలావస్థకు చేరింది. ప్రతీరోజు చుట్టుపక్కల నివాసముండే ప్రజలు వాటర్ ట్యాంకు వద్దకు వచ్చి బట్టలు ఉతకడం, నీళ్లు తీసుకెళ్లడం వంటివి చేస్తుంటారు. దీంతో ఎప్పుడు పడిపోతుందో తెలియక ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ట్యాంకు శిథిలావస్థకు చేరడంతో ఇనుప చువ్వలు తేలి ప్రమాదకరంగా మారాయి. ట్యాంకు కూలిపోతే పెద్దమొత్తంలో నష్టం జరిగే అవకాశాలున్నాయి.

నాలుగేళ్ల కిందట కొత్త ట్యాంకు నిర్మాణం..

సారంగపూర్‌లో ఇంటింటికీ మిషన్ భగీరథ నీరు అందించేందుకు నాలుగేళ్ల కిందట 50వేల లీటర్ల నీటి సామర్థ్యంతో ట్యాంకు నిర్మించారు. కొత్త ట్యాంకు ద్వారా నీరు సరఫరా చేసినా సరిపోకపోవడంతో ప్రస్తుతం మళ్లీ పాత ట్యాంకు ద్వారా గ్రామస్తులకు నీటిని అందిస్తున్నారు. పాతట్యాంకు వద్ద నాలుగు పిల్లర్లకు ఇనుపచువ్వలు తేలి ప్రమాదకరంగా మారినా వినియోగిస్తూనే ఉన్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి పాతట్యాంకును తొలగించి కొత్తట్యాంకును ఏర్పాటు చేయాలని స్థానికులు వేడుకుంటున్నారు.

సరిపోకనే పాతట్యాంకు వినియోగం

గ్రామస్తుల అవసరాలకు కొత్త ట్యాంకు ద్వారా నీటి సరఫరా సరిపోవడం లేదు. దీంతో ప్రమాదమైన పాతట్యాంకును వినియోగిస్తున్నాం. సమస్యను ఇప్పటికే అధికారుల దృష్టికి తీసుకెళ్లాం.
– సుజాత, సర్పంచ్, సారంగపూర్

అటెన్షన్ ప్లీజ్.. వృథాగా భగీరథ జలం



జిల్లా కేంద్రంలోని శాస్త్రినగర్ నుంచి గొల్లపేట్ వెళ్లే మార్గంలో మిషన్ భగీరథ పైపులైన్‌కు లీకేజీ ఏర్పడటంతో తాగునీరంతా రోడ్డుపై వృథాగా పోతుంది. వారం రోజులవుతున్నా మున్సిపల్ సిబ్బంది పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

ప్రశ్నించాల్సిన అధికారి: దేవిదాస్, మున్సిపల్ శానిటేషన్ అధికారి, ఫోన్: 70366 61060

జగ్జీవన్‌రామ్ సేవలు మరువలేనివి



కడెంలో నివాళులర్పిస్తున్న నాయకులు



ఖానాపూర్‌లో ఎమ్మెల్యే రేఖానాయక్ నివాళి



కుభీర్ తహసీల్దార్ కార్యాలయంలో..



సారంగపూర్‌లో..



లోకేశ్వరం: హవర్గలో పూలమాల వేస్తున్న నేతలు



కుంటాల: పెంచికల్‌పాడ్‌లో

- ఎమ్మెల్యే రేఖానాయక్
- ఊరూరా మహనీయుడికి నివాళి

ఖానాపూర్: మాజీ ఉపప్రధాని జగ్జీవన్‌రామ్ దేశానికి చేసిన సేవలు మరువలేనివని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. బుధవారం పట్టణంలోని విశ్రాంతి భవనం ఆవరణలో అంబేద్కర్ సంఘం, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో వేర్వేరుగా జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే హాజరై జగ్జీవన్‌రాం చిత్రపటానికి నివాళులర్పించారు. వెంకట్రావు, రాజేశ్ నాయక్, నెహ్రూనాయక్, మునుగురి నవీన్, రాజేశ్వర్, శంకర్, గౌరై గంగాధర్, తదితరులు ఉన్నారు. పట్టణంలోని విశ్రాంతి భవనంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జయంతి నిర్వహించారు. మురళీకృష్ణ, ప్రణీత్, కమలాకర్, శ్రీకాంత్, భరత్ ఉన్నారు.

ముధోల్: మండల కేంద్రంలోని మోర్చి సంఘం, ఎంపీడీవో కార్యాలయం, సామాజిక ఆస్పత్రిలో జయంతి నిర్వహించారు. బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు అఫ్రోజ్‌ఖాన్, ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయ్‌ఆనంద్, భోజరాం తదితరులు ఉన్నారు.

భైంసాటౌన్: పట్టణంలోని డాక్టర్స్ అసోసియేషన్ భవనంలో జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సిబ్బందికి సీపీఆర్‌పై శిక్షణ అందించారు. ఏరియాస్పత్రి సూపరింటెండెంట్ కాశీనాథ్, రామకృష్ణగౌడ్ తదితరులున్నారు.

కడెం: మండల కేంద్రంలో జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. అంబేద్కర్ సంఘం నాయకులు వారి చిత్రపటానికి నివాళర్పించారు. రమేశ్, చిన్నయ్య, రాజు, కొమురయ్య, తదితరులు ఉన్నారు.

సారంగపూర్: మండలంలోని జామ్ గ్రామంలోని సాంఘీక సంక్షేమశాఖ బాలికల గురుకులంతోపాటు మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో గురుకులం ప్రిన్సిపాల్ రమాకళ్యాణి, సిబ్బంది, నాయకులు నరేశ్, రమేశ్, హర్షవర్ధన్, వినోద్, సిద్దు, నవీన్, సాయన్న, తదితరులున్నారు.

దస్తురాబాద్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జగ్జీవన్‌రావ్ చిత్రపటానికి నివాళులర్పించారు. డిప్యూటీ తహసీల్దార్ తెలంగ్‌రావు, ఆర్‌ఐ గంగన్న, సిబ్బంది విజయ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

తానూరు: మండల కేంద్రంలోని ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. ఆర్‌ఐ గంగాధర్, సిబ్బంది పాల్గొన్నారు.

కుంటాల: మండలంలోని పెంచికల్‌పాడ్‌లో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పించారు. సర్పంచ్ భోజాబాయి, దిగంబర్ పటేల్ పాల్గొన్నారు.

కుభీర్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. ఎస్సీ హాస్టల్, ఎస్సీ వాడలోని అంగన్‌వాడీ కేంద్రంలో వేడుకలు నిర్వహించారు. తహసీల్దార్ విశ్వంభర్, అంగన్‌వాడీ టీచర్ సత్యశీల పాల్గొన్నారు.

లోకేశ్వరం: మండలంలోని హవర్గలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పించారు. సర్పంచ్ భుజంగ్‌రావు, రత్నాకర్‌రావు, భోజన్న, ప్రశాంత్, పోశెట్టి తదితరులు ఉన్నారు.

నర్సాపూర్(జి): మండల కేంద్రంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పించారు. జెడ్పీటీసీ చిన్న రామయ్య, సర్పంచ్ రాంరెడ్డి, ఎంపీటీసీ మల్లేశ్, రమేశ్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

‘ప్రభుత్వంపై బురదజల్లే యత్నం’



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేఖానాయక్

ఖానాపూర్: పదోతరగతి పరీక్ష ప్రశ్నపత్రాలను లీక్ చేయించి రాష్ట్రప్రభుత్వంపై బురద జల్లేందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ యత్నిస్తున్నాడని ఎమ్మెల్యే రేఖానాయక్ ఆరోపించారు. బుధవారం పట్టణంలోని తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. టీఎస్‌పీఎస్సీ పరీక్షలతోపాటు పదోతరగతి ప్రశ్నపత్రాల లీకేజీల్లో బీజేపీ నాయకుల పాత్ర ఉందని.. విచారణ చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు పుప్పాల శంకర్, లచ్చన్న, రాజగంగన్న, గజేందర్, శ్రావణ్, శ్యాం, రంజిత్, తదితరులు ఉన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

ఖానాపూర్: మండలంలోని పాత తర్లపాడ్ గ్రామంలో గండి రాజరాజేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా అర్చకులు హరీశ్, ప్రశాంత్‌చారి ఆధ్వర్యంలో మహారుద్రాభిషేకం, అంకురార్పనం, వేదపారాయణం, అగ్నిప్రతిష్ఠ, మహిళల కుంకుమార్చన, పూర్ణాహుతి హారతితో పాటు అన్నదానం చేశారు. ఎమ్మెల్యే రేఖానాయక్, పలువురు హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా తీర్థప్రసాదం అందించి శాలువాతో సన్మానం చేశారు. ఆలయ అభివృద్ధికి రూ.రెండు లక్షలు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పడిగెల రాజశేఖర్, భాస్కరచారి, రఘుపతిరెడ్డి, రాంరెడ్డి, మల్లరెడ్డి, చిన్నబాపు, శ్రావణ్, గంగారెడ్డి, శ్రీనివాస్, మహేందర్, రాజు తదితరులున్నారు.

కడెంలో..

కడెం: మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు హోమాలు చేయగా మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు.

కొనసాగుతున్న ‘బలగం’ ప్రదర్శన

ఖానాపూర్: మండలంలోని బాదనకుర్తి పంచాయతీ పరిధిలోని చింతలపేట్ గ్రామంలో సర్పంచ్ పార్శపు శ్రీనివాస్, ఎంపీటీసీ శనిగారపు రాణిశ్రావణ్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి బలగం సినిమా ప్రదర్శించారు. సోమవారం రాత్రి బాదనకుర్తిలో నర్సవ్వ, రాజన్న దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు శనిగారపు భీమరాజు సినిమా ప్రదర్శన ఏర్పాటు చేయగా గ్రామస్తులు వీక్షించారు.

కుంటాల: మండలంలోని కల్లూర్ గ్రామంలో బుధవారం రాత్రి వైస్ ఎంపీపీ పసుల మౌనికనవీన్, మాజీ ఉపసర్పంచ్ ప్యాట్ల రజినీకాంత్‌రావు ఆధ్వర్యంలో బలగం సినిమా ప్రదర్శించారు. బంధాలను గుర్తు చేసే సినిమా కావడంతో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు తరలివచ్చారు.

మండల కేంద్రంలో గురువారం రాత్రి పంచాయతీ కార్యాలయ ఆవరణలో మెసినేని వెంగల్‌రావు, శ్రావణ్ కుమార్, జుట్టు వెంకటి ఆధ్వర్యంలో బలగం సినిమా ప్రదర్శించనున్నారు.

‘సమ్మేళనం’ విజయవంతం చేయండి

ముధోల్: మండల కేంద్రంలో ఈనెల 10న నిర్వహించే ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు అఫ్రోజ్‌ఖాన్ అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాయంలో కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రైతుబంధు మండలాధ్యక్షుడు రాంరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు సయ్యద్‌ఖలీద్, రవీందర్‌రెడ్డి, అరిఫోద్దీన్, శ్యాంరావ్, పోశెట్టి, పోతన్న యాదవ్ ఉన్నారు.

భైంసారూరల్: పట్టణంలోని గౌరీశంకర్ ఫంక్షన్‌హాల్‌లో ఈనెల 9న నిర్వహించే ఆత్మీయ సమ్మేళనానికి కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు భూమారెడ్డి కోరారు. బుధవారం మండలంలోని టాక్లి, లింగా, చుచుంద్, సిద్దూర్ గ్రామాల్లో పర్యటించి కార్యకర్తలతో మాట్లాడారు. గ్రామాల్లో సమస్యలు ఉంటే ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. పీఏసీఎస్ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, పండిత్‌రావు, భీంరావు, యశ్వంత్, సంజీవ్ ఉన్నారు.

ఉద్యమనేతకు ఘన స్వాగతం



స్వర్ణలో ఇఫ్తార్ విందులో పాల్గొన్న శ్రీహరిరావు

సారంగపూర్: తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన కూచాడి శ్రీహరిరావుకు మండలంలోని స్వర్ణ, జామ్ గ్రామాల ప్రజలు ఘనస్వాగతం పలికారు. బుధవారం ఆయన గ్రామాలకు వెళ్లి ప్రజల మంచి చెడు తెలుసుకున్నారు. అనంతరం ముస్లింలతో కలిసి ఇఫ్తార్‌విందులో పాల్గొన్నారు. వారి వెంట అబ్దుల్‌హాదీ, నర్సయ్య, మారుతీ, రవికుమార్, శ్రీనివాస్, గంగయ్య, ఆయా గ్రామాల ప్రజలు ఉన్నారు.



గిట్లయితే ప్రమాదం జరుగదా?

జిల్లా కేంద్రంలో పలువురు యువకులు ప్రమాదకరంగా బైక్‌లు నడుపుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. బుధవారం ఆర్టీసీ డిపో ప్రాంతంలో నలుగురు యువకులు ఓ బైక్‌పై ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న ఈ దృశ్యాన్ని సాక్షి క్లిక్‌మనిపించింది. పోలీసులు ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.
–సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

పలువురి బీజేపీ నాయకుల అరెస్టు

- పలు చోట్ల నిరసన
- సీఎం దిష్టిబొమ్మ దహనం



ఖానాపూర్‌లో దహనం చేస్తున్న నాయకులు



తానూరు: దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నేతలు



లక్ష్మణచాంద: బీజేపీ నాయకులతో ఎస్సై రాహుల్

మామడ: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్ అరెస్టు నేపథ్యంలో నిరసన చేపడుతారనే కారణంతో బుధవారం ఆ పార్టీ స్థానిక నాయకులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బీజేపీ మండల కన్వీనర్ కొరిపెల్లి లింగారెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఏలేటి చిన్న లింగారెడ్డి, శమంత్‌రెడ్డి, నరేశ్, రమణ, గంగాధర్, హర్షవర్ధన్‌రెడ్డి, శ్రీకాంత్, రాజేశ్వర్ ఉన్నారు.

కడెం: మండల కేంద్రంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి రాజేందర్, ఉపాధ్యక్షుడు రమణారెడ్డితోపాటు భాస్కర్, కృష్ణ, వేణుగోపాల్, శ్రీనివాస్‌ను అరెస్టు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

లక్ష్మణచాంద: మండలంలోని పలువురు బీజేపీ నాయకులను ఎస్సై రాహుల్ గైక్వాడ్ ఆధ్వర్యంలో అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మండలాధ్యక్షుడు అనిల్, ఉపాధ్యక్షుడు రంజిత్, గంగాధర్, రాజు, శంకర్, హరీశ్ తదితరులు ఉన్నారు.

ఖానాపూర్: బండి సంజయ్ అరెస్టును నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని తెలంగాణ తల్లి చౌరస్తా వద్ద సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పెంబి జెడ్పీటీసీ జానుబాయి మాట్లాడారు. నోటీసులు ఇవ్వకుండా ఎంపీని అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమన్నారు. నాయిని సంతోష్, అంకం మహేందర్, ఆనంద్, రాము, లక్ష్మణ్, శ్రీనివాస్, రమేశ్‌గౌడ్, సాయి, సుధాకర్, శ్రీనివాస్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

ఖానాపూర్‌లో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ పడాల రాజశేఖర్, మండల అధ్యక్షుడు టేకు ప్రకాశ్, బుచ్చన్న, డి.మల్లయ్య, రాజేందర్, రాజేశ్వర్, తదితరులను ఎస్సై శంకర్ ఆధ్వర్యంలో అరెస్ట్ చేశారు.

లక్ష్మణచాంద: సోన్ మండలంలోని బీజేపీ నాయకులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బీజేపీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్, ప్రేమ్‌కుమార్, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు సాయన్న ముత్యం తదితరులు ఉన్నారు.

కుంటాల: మండల కేంద్రంలో ఎస్సై హన్మాండ్లు ఆధ్వర్యంలో బీజేపీ నాయకులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో ఎంపీపీ గజ్జారాం యాదవ్, ఎంపీటీసీ కట్ట రవి, పి.వెంగళరావు, గజేందర్, లక్ష్మణ్‌పటేల్, భూమన్న, ఫహీం ఖాన్, సాయన్న, మాధవరావు ఉన్నారు.

తానూరు: మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో బీజేపీ నాయకులు ఆందోళన చేశారు. అనంతరం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, సోమ్‌నాథ్, గోపాల్‌స్వామి, గణేశ్, సాయినాథ్, హిర్వంత్ పాల్గొన్నారు.

నర్సాపూర్(జి): మండల కేంద్రంలో బీజేపీ నాయకులు సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. బండి సంజయ్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు అర్జున్ ఠాకూర్, జిల్లా కార్యదర్శి మిట్టపల్లి రాజేందర్, బొల్లి చంద్రశేఖర్, నరేందర్ ఉన్నారు.

ముధోల్: బండి సంజయ్ అరెస్టును నిరసిస్తూ బుధవారం ముధోల్‌లోని ఐబీ చౌరస్తాలో బీజేపీ నాయకులు దేవోజీ భూమేశ్ ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. కార్యక్రమంలో పోతన్న, రమేశ్, సాయినాథ్, శ్రీను, జీవన్, తదితరులు ఉన్నారు.

మంత్రి పరామర్శ

సారంగపూర్: మండలంలోని కౌట్ల(బి) గ్రామానికి చెందిన వంగ రాంరెడ్డి తండ్రి వెంకట్‌రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని బుధవారం మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పరామర్శించారు. అనంతరం ఇదే గ్రామానికి చెందిన కౌట గంగాధర్ అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబసభ్యులను సైతం పరామర్శించారు. ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, మాధవరావు, నారాయణరెడ్డి, తదితరులు ఉన్నారు.

జెడ్పీటీసీ పరామర్శ

సారంగపూర్: మండలంలోని బోరిగాం గ్రామానికి చెందిన ఏనుగు ముత్యంరెడ్డి తల్లి లస్మవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. బుధవారం బాధిత కుటుంబసభ్యులను జెడ్పీటీసీ రాజేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. సర్పంచ్ రాజారెడ్డి, బీరవెల్లి మాజీ సర్పంచ్ ఎల్లన్న, సురేందర్ తదితరులు ఉన్నారు.